క్లుప్తంగా

ఉమాసోమేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉమాసోమేశ్వరస్వామి

భీమవరం (ప్రకాశంచౌక్): గునుపూడిలో వేంచేసియున్న పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్ధనస్వామి వార్ల దేవస్థానం నందు కార్తీక మాసోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమాసోమేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం 23వ రోజు సందర్భంగా రూ.5,50,195 ఆదాయం వచ్చిందని ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు.

గోపిమూర్తి గెలుపునకు యూటీఎఫ్ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న యూటీఫ్ నాయకులు

కాళ్ల: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేయుచున్న పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తిని గెలిపించాలని కోరుతూ యూటీఫ్ కాళ్ల మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఫ్ జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, మండల అధ్యక్షుడు బీఆర్ఎంకే స్వామి, ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్రావు, పి.ప్రభుదాసు, తదితరులు పాల్గొన్నారు.

'అమ్మానాన్న' పుస్తక ఆవిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న పారిశ్రామికాభివృద్ధి సంస్థ చైర్మన్ మంతెన రామరాజు

ఉండి: కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసేలా 'అమ్మానాన్న' పుస్తకం ఉందని రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ చైర్మన్ మంతెన రామరాజు అన్నారు. డీవీ బాలసుబ్రహ్మణ్యం రచించిన అమ్మానాన్న పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉండి లయన్స్ ఆడిటోరియంలో రచయితలు, సాహితీవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ సమాజంలో కుటుంబ బాంధవ్యాలు క్షీణించిపోతున్న సమయంలో రచయిత డీవీ బాలసుబ్రహ్మణ్యం ఓ మంచి పుస్తకాన్ని రచించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, పేరి కామేశ్వరరావు, పార్వతీశర్మ, కేవీస్ రావు, విజ్ఞాన వేదిక చెరుకువాడ రంగసాయి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సత్తి బ్రహ్మరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. బీచ్‌కు వెళ్లే వారితో పాటు అయ్యప్ప, భవానీ మాలధారులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, ఆలయ, చైర్మన్ కడలి మాణిక్యాలరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా గణపతి హోమం



గగ్గిపర్రులో గణపతి హోమం చేస్తున్న అయ్యప్ప మాలధారులు

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం పంచాయతీ గగ్గిపర్రు గ్రామంలోని పెద రామాలయంలో గురుస్వామి జొన్నల వాసు ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు ఆదివారం గణపతి హోమం నిర్వహించారు. గురుస్వామి జొన్నల వాసు పాటు 18 మంది మాలధారులతో అర్చకులు ఏడిద నరసింహాచార్యులు, ప్రసాదాచార్యులు, శ్రీనివాసుల సాయి భగవానాచార్యులు శాస్త్రోక్తంగా హోమం చేయించారు. అయ్యప్ప మాలధారులతో పాటు వారి కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి హోమంలో ద్రవ్యాలు వేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘాటెక్కిన ఉల్లి ధర



మార్కెట్‌కు వచ్చిన కొత్త కర్నూలు ఉల్లిపాయలు



గ్రామాలకు తరలుతున్న నాసిరకం ఉల్లి

- కేజీ రూ.70 నుంచి రూ.90 వరకు పలుకుతున్న వైనం
- బెంబేలెత్తుతున్న జనం

ఆకివీడు : ఉల్లి ధర మళ్లీ లొల్లి చేస్తోంది. ఇప్పటికే భారీగా పెరిగిన ధర దిగి రాకపోవడంతో వినియోగదారులు అంత వ్యయం భరించలేక సతమతమవుతున్నారు. ఈ క్రమంలోనే మరోసారి ఉల్లి ధర పెరగడంతో సామాన్య ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే కర్నూలు రకం కేజీ ఉల్లి ధర మార్కెట్‌లో రూ.55 నుంచి రూ.60 వరకు విక్రయిస్తుండగా, తాజాగా అది రూ.70కి చేరింది. మహారాష్ట్ర నుంచి వచ్చే ఉల్లిపాయలు ఉండి నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో రూ.80 నుంచి రూ.90 వరకు విక్రయిస్తున్నారు. వరదల ప్రభావంతో ఉల్లి పంట దెబ్బతిందని, ప్రస్తుతం ఉల్లి పంట నాట్లు ప్రారంభమయ్యాయని, డిసెంబర్ నెలాఖరుకు, జనవరి మొదటి వారంలో గాని కొత్త ఉల్లిపాయలు వచ్చే అవకాశం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం కర్నూలు ఉల్లిపాయలు కూడా మార్కెట్‌లో రాజ్యమేలుతున్నాయి. కొత్త ఉల్లి ధర రూ.70 వరకూ పలుకుతోంది. వినియోగదారులు ఘాటెక్కిన ఉల్లిధరలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోలాపూర్‌కు చెందిన ఉల్లిపాయలు మార్కెట్‌లోకి దిగుమతి అయ్యాయి.

కానరాని మార్క్‌ఫెడ్ ఉల్లి

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో మహారాష్ట్రకు చెందిన మార్క్‌ఫెడ్ నుంచి రాష్ట్ర మార్క్‌ఫెడ్ సంస్థ ఉల్లిపాయలను కొనుగోలు చేసి ప్రజలకు తక్కువ ధరకు విక్రయించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఉల్లిపాయల ధర మండిపోతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. సివిల్ సప్లై సెంటర్ల పేరుతో తూతూ మంత్రంగా కేంద్రాలు తెరిచినప్పటికీ ఒకటి, రెండు రోజులు మాత్రమే ఉల్లిపాయలను విక్రయించి చేతులు దులుపుకున్నారని విమర్శిస్తున్నారు. కేంద్రాల్లో విక్రయించే ఉల్లిపాయలు వారి దగ్గరే కుళ్ల కంపు కొడుతుంటే, వీటిని కొనుగోలు చేసి మేము ఏమి చేసుకోవాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీంతో సెంటర్లు వెలవెలబోవడంతో ఆయా మండల కేంద్రాల్లో దుకాణాలు మూసివేశారు. సివిల్ సప్లై శాఖ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖల మధ్య సమన్వయలోపంతో మేము ఉల్లిపాయలను అమ్మలేమని చేతులెత్తేశారని పలువురు వినియోగదారులు ధ్వజమెత్తుతున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లిపాయలను కొనుగోలు చేసి ప్రజలకు తక్కువ ధరకు విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొనలేక... అమ్మలేక

ఉల్లిపాయలను కొనలేకపోతున్నాం, అమ్మలేకపోతున్నాం. అధిక ధరలకు కొనుగోలు చేసి, అమ్ముతున్నా నష్టమే వస్తుంది. ప్రస్తుతం వస్తున్న ఉల్లిపాయల్లో నాణ్యత లోపిస్తుంది. దీని వల్ల ఉల్లిపాయలు వ్యాపారుల వద్దే కుళ్లిపోతున్నాయి. నాణ్యమైన ఉల్లిపాయలను కొనుగోలు చేసి విక్రయిస్తున్నా అమ్మో అంత ధరా అని వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. జనవరి రెండో వారానికి గాని ఉల్లి ధర తగ్గే అవకాశం లేదు. ప్రభుత్వాలు ఉల్లి దిగుమతులపై దృష్టి పెట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

జిడ్డు నాగేశ్వరరావు,
కూరగాయల వ్యాపారి, ఆకివీడు

కార్తీక మాసమైనా మండుతోన్న ధర

కార్తీకమాసంలో ఉల్లి, వెల్లుల్లి వాడకం తగ్గుతుంది. అయినప్పటికీ మార్కెట్‌లో ఉల్లి ధరలు మండుతూనే ఉన్నాయి. డిమాండ్‌కు తగ్గ ఉల్లి దిగుమతులు లేనందువల్లే ఈ పరిస్థితి నెలకొంది. హిందువుల్లో అధిక శాతం మంది కార్తీక మాసం నెల రోజులూ వంటల్లో ఉల్లిపాయలు, వెల్లుల్లిపాయల వాడకం పూర్తిగా నిలుపుదల చేస్తారు.

సంక్రాంతికి తగ్గుముఖం

సంక్రాంతి పండుగ నాటికి ఉల్లి ధర సాధారణ స్థాయికి వచ్చే అవకాశం ఉందని, అప్పటి వరకూ అధిక ధరలు తప్పవని వ్యాపారస్తులు చెబుతున్నారు. మహారాష్ట్ర నుంచి ఉల్లి పంట బయటకు వస్తేనే ధరలు తగ్గే అవకాశం ఉందంటున్నారు. రాష్ట్రంలో కూడా భారీ వర్షాలు, వరదలకు ఉల్లి పంట దెబ్బతింది. దీంతో ఉల్లి పాయల ధరలు ఇప్పట్లో తగ్గే అవకాశం కన్పించడం లేదు.

ఐకమత్యానికి ప్రతీక కార్తీక వనసమారాధన



కార్తీక వన సమారాధనలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



నందం అబద్ధయ్యను సత్కరిస్తున్న నాయకులు

భీమవరం: కార్తీక వనసమారాధనలతో ఐకమత్యం పెరుగుతుందని ఇస్రో శాస్త్రవేత్త డీవీ మహాలక్ష్మి, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, ఏపీ రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ అన్నారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని కొపా కల్యాణ మండపంలో కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (కొపా) 29వ వార్షికోత్సవ కార్తీక వనసమారాధనను నిర్వహించారు. కార్యక్రమంలో నొకాన్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ గ్రంధి హర్ష, రిటైర్డ్ కస్టమ్స్ అధికారులు బళ్ల నరేంద్ర కుమార్, టీడీపీ నాయకులు మెంటే పార్థసారథి, సీఎస్ఎన్ కళాశాల సెక్రటరీ చీడే సత్యనారాయణ, పళ్లా ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో

ఆకివీడు: స్థానిక బైపాస్‌రోడ్డులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద ఆదివారం కార్తీక వన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచ వృత్తులు చేసే విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. వీరికి ప్రభుత్వ తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. విశ్వ బ్రాహ్మణుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తొలత ఆలయం వద్ద విశ్వబ్రాహ్మణుడికి శేషగిరిరావు, మల్లేశ్వరి దంపతులు, ఉసిరి చెట్టు వద్ద గెద్దం నాగేశ్వరరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్తీక వన భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు తామాడ సత్య శ్రీనివాసరావు, పెదగాడి కృష్ణ, పట్నాల భసవాచార్యులు, జీవీ.సత్యనారాయణమూర్తి (బాబు), రామాచార్యులు, పలువురు సంఘ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

పద్మశాలి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో

భీమవరం (ప్రకాశంచౌక్): ఐక్యంగా ఉండి సంఘాభివృద్ధికి పాటు పడాలని ఏపీ పద్మశాలి వైల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య అన్నారు. ఆదివారం స్థానిక ప్రకృతి ఆశ్రమం సమీపంలో నిర్వహించిన భీమవరం పట్టణ పద్మశాలి అభ్యుదయ సంఘం కార్తీక వనసమారాధనకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. విద్యా, ఉద్యోగాల్లో రాణిస్తూ సంఘాభివృద్ధికి పాటు పడాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు, మహిళలకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముందుగా ఉసిరి చెట్టు వద్ద కార్తీకదామోదర పూజ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మా దేవీవెంకట శివప్రసాద్, గిడుతూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జానపాటి మధుసూధనరావు, కోశాధికారి కాసుల ప్రసాద్, సహాయ కార్యదర్శులు కట్టా లక్ష్మణ స్వామి, గిడుతూరి నారాయణరావు, కాపా త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

యువతకు రాజమార్గం ఎన్‌సీసీ



ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: ఆర్మీ, పోలీస్ వంటి సాయుధ దళాల్లో చేరే యువతకు ఎన్‌సీసీ రాజమార్గమని డీఎన్నార్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) అన్నారు. డీఎన్నార్ కళాశాలలో ఆదివారం 76వ ఎన్‌సీసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీఎన్నార్ ఎన్‌సీసీ విభాగం యువతకు మార్గ దర్శకత్వం వహిస్తూ ఎంతో మంది జీవితాలకు బంగారు బాటలు వేసిందన్నారు. ఎన్‌సీసీలో చేరిన ప్రతి క్యాడెట్ ఒక బాధ్యతాయుత అధికారిగా ఎదగాలని ఆకాంక్షించారు. ముందుగా ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్యాడెట్లకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.మోజెస్, కె.రామకృష్ణంరాజు, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎ.వీరయ్య, సీహెచ్ బోసురాజు, తదితరులు పాల్గొన్నారు.

పొగతో రోడ్డు ప్రమాదాలు



గొల్లవానితిప్ప రోడ్డులో ప్రకాష్ నగర్ వద్ద పొగతో ఆర్అండ్‌బీ రోడ్డు

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప రోడ్డులోని ప్రకాష్‌నగర్ వద్ద చెత్తకు నిప్పంటించడంతో వచ్చే పొగతో తరచూ ప్రయాణికులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమవరం పట్టణంలోని టన్నుల చెత్తను ప్రకాష్ నగర్ వద్ద యనమదుర్రు కాలువ గట్టుపై డంపింగ్ చేస్తున్నారు. రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా చెత్తకు నిప్పు పెట్టడంతోవచ్చే పొగ వలన రోడ్డుపై వెళ్లే వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అంతే కాకుండా దుర్వాసనతో ముక్కుపుటలు బద్దలయ్యేలా సుమారు కిలోమీటర్ వరకు దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

స్టేషన్‌పేటలో ఇరిగేషన్ స్థలం ఆక్రమణ

జనసేన నాయకుల హస్తం?



30వ వార్డులో ఆక్రమణకు గురైనట్టుగా చెబుతున్న ప్రాంతం

నరసాపురం: పట్టణంలోని 30వవార్డులో ఇరిగేషన్ శాఖకు చెందిన మురుగు కాలువగట్టు స్థలం ఆక్రమణకు గురైంది. కబ్జాదారులు గత 30 రోజుల నుంచి కాలువగట్టు వెంబడీ స్థలాన్ని బాగుచేయించుకుని స్తంభాలు పాతిమరీ తీరుబడిగా భూమిని ఆక్రమించుకుంటుంటే అధికారులు పట్టించుకోవడం లేదని అనేక విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం కాలువగట్టు వెంబడి సుమారు 50 సెంట్ల స్థలంలో స్తంభాలు వేసి, చుట్టూ గుడ్డలు కట్టారు. ఈ వ్యవహారం వెనుక వార్డుకు చెందిన కొందరు జనసేన నాయకుల ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. కోట్లాది రూపాయలు విలువచేసే స్థలం కబ్జాకు గురవ్వడంపై స్థానికులు కొందరు కబ్జాదారులను ప్రశ్నించినా కూడా వారు దౌర్జన్యంగా సమాధానం చెప్తున్నారని వాపోతున్నారు. దీంతో వార్డు ప్రజలు ఈ విషయాన్ని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లే యోచనలో ఉన్నారు. ఈ స్థలానికి ఎదురుగా ఉన్న స్థలం అంశంలో కూడా స్థానికులకు పట్టణంలోని ఓ ప్రముఖ వైద్యుడికి మధ్య చాలాకాలంగా వివాదం నడుస్తోంది. చివరకు ఈ వివాదం కోర్టుకు చేరింది. మళ్లీ ఇప్పుడు ఇదే వార్డులో మరో సమస్య తెర మీదకు వచ్చింది. దళితులు అత్యధికంగా ఉండే ఈ వార్డులో ఇటీవల కాలంలో భూముల కబ్జా ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది.

చదరంగంతో ఏకాగ్రత పెరుగుదల



బాలుడితో కలిసి చెస్ ఆడుతున్న ఆర్‌డీఓ దాసి రాజు

పాలకొల్లు సెంట్రల్: చదరంగం వల్ల పిల్లల్లో మేథాశక్తి, ఏకాగ్రత పెరుగుతుందని నరసాపురం ఆర్‌డీఓ దాసి రాజు అన్నారు. ఆదివారం స్థానిక యూరో కిడ్స్ స్కూల్లో జిల్లా స్థాయి ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ చదరంగం పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ ఏ వయస్సు వారైనా, ఏ సమయంలోనైనా, ఏ ప్రదేశంలోనైనా ఆడుకునే క్రీడ చదరంగమని అన్నారు. కొన్ని క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తే చెస్ మాత్రం మేథస్సును పెంచుతాయన్నారు. ఈ సందర్భంగా బాలుడితో కలిసి ఆడుతూ చెస్ పోటీలను ప్రారంభించారు. చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మాదాసు కిషోర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి 100 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ పోటీలకు ఆతిథ్యమిచ్చిన యూరో కిడ్స్ స్కూల్ అధినేత మద్దుల రాజేష్ గుప్తకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా పి.రవిప్రసాద్, సురేష్, రాణి తదితరులు వ్యవహరించారు.

గోరింటాడలో వైద్య శిబిరం



మెడికల్ క్యాంపు వద్ద కాపు క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని గోరింటాడ గ్రామంలో యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం క్లబ్ అధ్యక్షులు జక్కంపూడి మదన్ మాట్లాడుతూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాల వల్ల ప్రజలు ఎలాంటి ఖర్చులు లేకుండా తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవచ్చన్నారు. ఈ క్యాంపుల్లో మెరుగైన వైద్య సేవల కోసం క్లబ్ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు నారిన హర్ష, కార్తీక్, లక్ష్మీప్రసన్న, జక్కంపూడి సుభాషిణి, పెనుమాక భార్గవి శిబిరంలో తమ సేవలను అందించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ వేరుకొండ దుర్గాప్రసాద్, ట్రెజరర్ శిరిగినీడి నాగార్జున, పోకల రాము, గంధం ఏసుపాదం, గుండుమోగుల వీరాస్వామి, సత్తి నీడి రాజా తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: వడలి మందాలమ్మ ఆలయ ప్రాంగాణంలో పెనుగొండ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సీహెచ్ శిరీష డాక్టర్ ఎస్‌వీడీ పవన్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు.

కిలాడి అప్పారావుకు ఘన నివాళి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

వీరవాసరం: కిలాడి అప్పారావు ఐదో వర్ధంతి సభ ఉత్తర పాలెం బీసీ కమిటీ హాల్ వద్ద పాలా అజయ్ ఘోష్ అధ్యక్షతన నిర్వహించారు. సభలో పాల్గొన్న జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ అదానీపై రూ.వేల కోట్ల వ్యవహారంపై అమెరికా కోర్టులో కేసు నమోదు కావటం, ఆ కేసులో ఆంధ్ర రాష్ట్రం పేరు ఉండడంపై కూటమి ప్రభుత్వం తక్షణం స్పందించాలన్నారు. భారీ అవినీతి అక్రమాలకు పాల్పడిన అదానీని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై, రోజు రోజుకూ పెరుగుతున్న అధిక ధరలకు వ్యతిరేకంగా పోరాటం ద్వారానే అప్పారావు ఆశయాలు నెరవేరుతాయన్నారు. కార్యక్రమంలో పాలా కోటేశ్వరరావు, కిలాడి సత్యనారాయణ, జుత్తిగ శ్రీనివాస్, అయినపూడి బాబురావు, బండి నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్తీక దీపోత్సవం

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు గ్రామంలో పద్మావతి కల్యాణ మందిరంలో కార్తీక దీపోత్సవం ఈ నెల 25వ తేదీ సోమవారం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. హరే కృష్ణ గోకుల క్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించే దీపోత్సవానికి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హరే రామ, హరే కృష్ణ నామ సంకీర్తనం ఉంటుందన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

పాలకోడేరు: గ్రామంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో 300 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేయించినట్లు కుముదవల్లి సర్పంచి భూపతిరాజు వంశీకృష్ణరాజు తెలిపారు. ఆదివారం స్థానిక పంచాయతీ వద్ద భీమవరం ఐడీఎల్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ పెన్మెత్స సూర్యసామిత్, నాయకులు శ్రీనివాసరాజు, సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని అనువైన మిల్లులకు విక్రయించొచ్చు

భీమవరం అర్బన్: రైతులు ధాన్యాన్ని అనువైన మిల్లులకు విక్రయించొచ్చని, మండలంలో రైతుసేవా కేంద్రాల ద్వారా పదకొండు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఏవో శ్రీనివాస్ మాట్లాడారు. గోనె సంచులు ఇవ్వడంతో పాటు హమాలి చార్జీలు చెల్లిస్తామని ఏవో నిమ్మల శ్రీనివాస్ తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10:30 గంటలు నుంచి అందించాలని కోరారు.

పందులు, పశువులను రోడ్లపైకి వదలొద్దు

నరసాపురం: పట్టణంలో రోడ్లపై పశువులు, పందులు తిరుగుతున్నట్టుగా ఫిర్యాదులు వస్తున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ యజమానులు పందులు, పశువులను రోడ్లపైకి వదిలితే మున్సిపల్ ప్రజారోగ్య చట్టం ప్రకారం యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పందులు, పశువులను వేరే ప్రాంతాలకు తరలించడంతో పాటుగా భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. పందులు, పశువులు రోడ్లపైకి రాకుండా కట్టడి చేసుకోవాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు



బాధితుడిని 108 వాహనంలో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: బ్రాహ్మణ చెరువు–పొలమూరు ఆర్అండ్‌బీ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ వ్యక్తి బ్రాహ్మణ చెరువు వైపు నుంచి పొలమూరు వైపు మోటారుసైకిల్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో క్షతగాత్రుని జేబులో ఉన్న ఫోన్ పూర్తిగా దెబ్బతినడంతో ఆ వ్యక్తి ఎవరనేది తెలియరాలేదని పోలీసులు తెలిపారు. 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు మరమ్మతుల నిమిత్తం ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డుకు అడ్డంగా కంకర గుట్టలు దింపి వదిలేయడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ఈ రోడ్డులో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఐదుగురు వరకు ప్రమాదానికి గురయ్యారని పేర్కొన్నారు.

పెనుమంట్రలో ఉచిత ధ్యాన శిక్షణ



ధ్యాన శిక్షణ ఇస్తున్న పిరమిడ్ మాస్టర్ గీతాలక్ష్మి

పెనుమంట్ర: పెనుమంట్రలో భూపతిరాజు శ్రీనివాసరాజు, సాయిగీతా దంపతులు నిర్మించిన బ్రహ్మర్షి పితామహ ధ్యాన మందిరంలో ఆదివారం మండపేటకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ గీతాలక్ష్మి పాల్గొని జ్ఞానబోధ చేసి, ధ్యాన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గీతాలక్ష్మి మాట్లాడుతూ భగవద్గీత అంటే జీవనగీత అని తెలిపారు. పత్రీజీ ప్రబోధించిన శ్వాసమీద ధ్యాన ఉంచి ధ్యాన సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో సుబ్బరాజు, మధు, సత్యవతి, తులసమ్మ, రమ, మంతెన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.